# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 07-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈరోజు హాజరుకానున్నారు.**

2. **ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో సభ్యులు క్రీడా స్ఫూర్తి కనబరిచారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

4. **వైద్య ఆరోగ్య శాఖలో గడచిన 20 నెలల్లో కూటమి ప్రభుత్వం దాదాపు 9వేల నియామకాలు పూర్తి చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ చెప్పారు.**

5. **ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు.**

==========================

ఢిల్లీలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో సాంకేతికత – సుపరిపాలన తదితర అంశాలపై ముఖ్యమంత్రి కీలక ఉపన్యాసం చేయనున్నారని అధికారులు వెల్లడించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ – అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం విజయవాడ నుంచి బయల్దేరి మద్యాహ్నం ఢిల్లీ చేరుకుంటారని, అక్కడ జరిగే "రైసినా డైలాగ్ 2026" సదస్సుకు ముఖ్యమంత్రి హాజరవుతారని వెల్లడించారు. ఈ ఏడాది జరిగే 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు "సంస్కార నిశ్చయత, సమన్వయం, పురోగతి" అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు. దేశంలో అభివృద్ధి పథాన నడుస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న సుపరిపాలన– డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారు.

--------------------------

ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఆటల పోటీల్లో క్రీడా స్ఫూర్తిని కనబరిచారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసన సభ్యులు అసెంబ్లీకే పరిమితం కాకుండా ఆల్ రౌండర్లుగా నిలిచారని అన్నారు. విజయవాడలోని నిన్న నిర్వహించిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యుల సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా

క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ…

వాయిస్…27 సెకన్లు

---------------------------

ప్రజల అవసరాలను తీర్చేలా రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రకరకాల కారణాలతో రాష్ట్రంలో కొన్ని నీటి ప్రాజెక్టులు సుదీర్ఘ కాలంపాటు హామీలుగా మిగిలిపోతున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాకపోవడం సరికాదని పేర్కొన్నారు. పోలవరం సహా రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పశువుల రవాణా సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్ ద్వారా జారీ చేసే.. "డిజిటల్ ట్రాన్స్‌పోర్ట్ సర్టిఫికెట్ జనరేషన్ సిస్టమ్"ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై పశువులను రవాణా చేయదలిచిన ప్రతి వ్యక్తి సంబంధిత పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి రవాణా ధృవీకరణ ప్రతం పొందిన తర్వాత మాత్రమే రవాణా చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌ను పశువుల రవాణా నిబంధనలకు అనుగుణంగా జారీ చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

వైద్య ఆరోగ్య శాఖలో గడచిన 20 నెలల్లో కూటమి ప్రభుత్వం దాదాపు 9వేల నియామకాలు పూర్తి చేసిందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ తెలిపారు. వీరిలో 2 వేల మంది వైద్యులు, 5,800 మంది పారా మెడికల్ ఉద్యోగులు, 1200 మంది ఆశా వర్కర్లు ఉన్నారని వెల్లడించారు. అసంక్రమిత వ్యాధుల నిరోధ చర్యల్లో భాగంగా ప్రాంతీయ ఏరియా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్లినిక్‌ల నిర్వహణ అవసరాల కోసం ఎంపిక చేసిన 74 మంది వైద్యులకు విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో మంత్రి నియామకపత్రాలు నిన్న అందజేశారు.

---------------------------

మండపేట నియోజకవర్గంలోని రోడ్ల పునరుద్ధరణ కోసం కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. శాసన సభలో సభ్యులడిగిన ప్రశ్నకు ఆయన నిన్న సమాధానమిస్తూ.. తాపేశ్వరం వద్ద ద్వారపూడి--యానాం రోడ్డులో బైపాస్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయిందని వెల్లడించారు. ఆ ప్రాజెక్టు పనులు బడ్జెట్ లభ్యత ఆధారంగా చేపడతామని చెప్పారు. గత రెండేళ్లలో 20 కోట్ల 50 లక్షల రూపాయలను నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు, అభివృద్ధి పనుల కోసం

మంజూరు చేస్తామని పేర్కొంటూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడల్లో మహిళలను ప్రోత్సహించేందుకు ASMITA కార్యక్రమంలో భాగంగా రేపు దేశ వ్యాప్తంగా 250 ప్రదేశాల్లో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ పోటీల్లో 13 ఏళ్లలోపు, 13 నుంచి 18 సంవత్సరాలలోపు, 18 సంవత్సరాలు పైబడిన వయస్సు గల విభాగాల్లో బాలికలకు, యువతకు, మహిళలకు అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 250 ప్రదేశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2021లో ప్రారంభమైన ASMITA లీగ్ క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడమే కాకుండా, దేశం అంతటా కొత్త ప్రతిభను గుర్తించడానికి వేదికగా ఉపయోగపడుతోందని వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున నిర్వహిస్తున్నఈ పోటీల్లో ఒకే రోజు రికార్డు స్థాయిలో 2 లక్షల 50 వేల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నారు.

---------------------------

ప్రజలకు సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో నిన్న నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

బీసీ సంక్షేమ వసతి గృహాల్లలో విద్యనభ్యసిస్తున్నవిద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో విద్యనభ్యసించే బీసీ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో సభ్యులు నిన్న అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానమిస్తూ.. బీసీ హాస్టళ్లలో చదవే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

---------------------------

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 లక్షల రూపాయల నిధులతో మైనార్టీ ఫంక్షన్ హాల్ భవన నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.

=====================